క్లుప్తంగా

పోచమ్మ ఆలయం పరిసరాల పరిశుభ్రం



వనపర్తి: వీపనగండ్ల మండల కేంద్రంలోని పోచమ్మ గుడి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో సర్పంచ్ నర్సింహారెడ్డి శనివారం పంచాయతీ సిబ్బందితో శుభ్రపరిచారు. గ్రామంలోని మహిళలు పోచమ్మ గుడికి వెళ్లి పూజలు చేసేందుకు వీలుగా గుడిచుట్టూ ఉన్న కంపతార చెట్లను తొలగించి, పరిసరాలను శుభ్రం చేయడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న ఇంటింటి ప్రచారం

పాన్‌గల్: మండలంలో టీడీపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి ప్రచారం కొనసాగుతుంది. శనివారం మండలంలోని అన్నారం, అన్నారం తండా, దావాజిపల్లి గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డా.పగిడాల శ్రీనివాసులు మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత టీడీపీది అన్నారు. కార్యక్రమంలో గోపాలకృష్ణనాయుడు, ఆనంద్, ఆశయ్య, రామస్వామి, చంద్రయ్య, సుధాకర్, సత్యానారాయణ, స్వామి, జగదీష్‌గౌడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పెబ్బేరు రూరల్: పెబ్బేరు, పెద్దమందడి మండలంలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, యువకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గుమ్మడం గ్రామానికి చెందిన 40 మంది, పెద్దమందడి మండలం మనిగిళ్లకు చెందిన 63మంది, పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన 12 మందికి శనివారం నందిహిల్స్‌లోని తన కార్యాలయంలో పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఐ సత్యారెడ్డి, సత్యశీలారెడ్డి, రాధాకృష్ణ శ్రీహరి రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, పాండు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థి ప్రతిభ



దీన్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న శివవరుణ్

ఆత్మకూర్: పట్టణానికి చెందిన వైద్య విద్యార్థి శివవరుణ్ ఎంబీబీఎస్ పూర్తిచేసి హౌస్ సర్జన్‌లో డాక్టరేట్ పట్టాను సాధించి ప్రతిభను చాటాడు. శ్రీవాణి హైస్కూల్ అధినేత టీజే విశ్వేశ్వర్, చైతన్యరాణి దంపతుల కుమారుడు శివవరుణ్ 2017లో ఉచితంగా ఎంబీబీఎస్ సీటును సాధించాడు. కరీంనగర్‌లోని ప్రతిమ మెడికల్ కళాశాలలో 2022లో ఎంబీబీఎస్ పూర్తిచేసి, 2023 సంవత్సరానికి గాను రాష్ట్ర స్థాయిలో హౌస్‌సర్జన్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి కళాశాల డీన్ జాన్‌ఇజ్రాయిల్ చేతుల మీదుగా శుక్రవారం రాత్రి డాక్టరేట్‌ను అందుకున్నాడు. ఈసందర్భంగా డాక్టర్ శివవరుణ్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు అభినందించారు.

మంచుగడ్డతో శివలింగం



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని యామిని ఐస్‌ముక్కలతో శివలింగాన్ని తయారు చేసింది. గ్రామానికి చెందిన విద్యుత్ ఉద్యోగి శ్రీకాంత్, మాధవి దంపతుల కుమార్తె అయిన యామిని కొత్తకోటలోని పాఠశాలలో ఏడో తరగతి చదువుతూ సెలవు రోజుల్లో ఇంటికి వచ్చి, హోం వర్క్‌లో భాగంగా చిత్రలేఖనం, న్యూస్ పేపర్లు, అట్టముక్కలతో వివిధ రకాల ఆకృతులను తయారు చేసి పలువురి ప్రశంసలు అందుకుంటుంది. మంచుముక్కలతో శివలింగం తయారు చేయడాన్ని చూసి స్థానికులు విద్యార్థినిని అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాన్‌గల్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ చందన్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏఈ తెలిపారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిరుద్యోగుల సంక్షేమానికి కృషి



కొత్తకోటలో చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట: దేవరకద్ర నియోజవర్గంలోని నిరుద్యోగ యువత కోసం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన 'ఆలన్న యువ ఉద్యోగ యాప్' పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవర్గంలోని నిరుపేద యువత కోసం ఏర్పాటు చేసిన నిరుద్యోగ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిపుణులచే రూపొందించిన యాప్ ద్వారా నిరుద్యోగులు ఎంతో నేర్చుకోవచ్చని సూచించారు. ఈ యాప్ ద్వారా పదో తరగతి నుంచి డీగ్రీ, పీజీ అర్హత కలిగిన ఉద్యోగాల కోసం శిక్షణ తీసుకోవచ్చన్నారు. యాప్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన అన్ని నోటిఫికేషన్ల వివరాలు పొందుపర్చుతారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగమే కాకుండా కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగ సాధనకు యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం సింగిల్‌విండో సహకారంతో ఎడ్యుకేషన్ రుణాలను లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా ఉమ్మడి మండలాలకు సంబంధించి రెండు అంబులెన్స్‌ను ప్రారంభించారు.



అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బీఆర్‌ఎస్‌లో చేరికలు..

మండలంలోని నాటవెళ్లిపెద్దతండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు లక్ష్మణ్‌నాయక్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరుతున్న వారికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ వంశీధర్‌రెడ్డి, ఎంపీపీ గుంత మౌనిక, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని, చెన్నకేశవరెడ్డి, విశ్వేశ్వర్, ఆకుల శ్రీనివాసులు, గాడీల ప్రశాంత్, భీంరెడ్డి, సాక బాలనారాయణ, కొండారెడ్డి, బాబురెడ్డి, ఎద్దుల నాగేష్, వినోద్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు

కులాంతర వివాహ చెక్కు అందజేత..

మదనాపురం: మండలంలోని కొన్నూరుకు చెందిన రవీందర్, సంతోషమ్మ కులాంతర వివాహం చేసుకున్నారు. దీని సంబంధించి శనివారం కొత్తకోటలో ప్రభుత్వం అందించే రూ.2.50లక్షల కులాంతర వివాహ చెక్కును ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి అందించారు.

20న డిక్లరేషన్ సంకల్ప సభ



సంకల్పసభ కరపత్రాలను విడుదల చేస్తున్న ముస్లిం నాయకులు

ఆత్మకూర్: తెలంగాణ రాష్ట్ర ముస్లిం డిక్లరేషన్ ఆవిష్కరణ సంకల్ప సభను ఈ నెల 20న పట్టణంలోని ఎంజీ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నామని కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ గయాసుద్దీన్ తెలిపారు. శనివారం స్థానిక ఈద్గా మసీదిద్‌లో ముస్లింలతో సమావేశమై, సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ముస్లింలకు రాజకీయంగా ఎదగకుండా కేవలం ఓటు బ్యాంకుకు మాత్రమే వాడుకుంటున్నారని, నామినేటెడ్ పదవులు, బడ్జెట్ కేటాయింపు, వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణ, సబ్సిడీ రుణాలు ఇలా అన్నిరంగాల్లో అన్యాయం చేస్తున్నారన్నారు. సంకల్పసభకు ముఖ్య అతిథిగా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ముఖ్యవక్తలుగా జాక్ రాష్ట్ర కన్వీనర్ సయ్యద్‌సలీంపాష, రచయిత స్కైబాబ, యూనస్‌పర్వేజ్, షేక్‌హనీఫ్, సయ్యద్‌నవాజ్, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్ తదితరులు హాజరవుతున్నారని, ముస్లింలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యహియా, అబ్దుల్‌గని, నిరంజన్, ఖదీర్, రఫీఖ్, ఆఫ్తాబ్, జాఫర్, యూసుఫ్, మహమూద్, జహీర్, నజీర్, షాకీర్, జాకీర్ తదితరులు ఉన్నారు.

అటవీ అధికారులకు జింక అప్పగింత

ఖిల్లాఘనపురం: దారితప్పి వచ్చిన ఓ జింకను గ్రామస్తులు పట్టుకొని అటవీ అధికారులకు అప్పగించారు. శనివారం మండలంలోని పర్వతాపురం శివారులోని గుట్టల నుంచి దారి తప్పిన ఓ జింక గ్రామంలోకి రాగా.. కుక్కలు వెంబడించడంతో గ్రామస్తులు చూసి రక్షించారు. దీంతో సర్పంచ్ నిర్మల అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి గాయపడిన జింకను స్వాధీనం చేసుకుని చికిత్స అందించారు. అనంతరం జంగమాయపల్లి అడవిలో జింకను వదిలేశామని అధికారి భాస్కరాచారి చెప్పారు.



కష్టపడి చదివితే బంగారు భవిష్యత్

కొత్తకోట రూరల్: బాలికలు ప్రాథమిక విద్య నుంచే కష్టపడి చదివితే భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని షీ టీం ఎస్ఐ ఇందిర అన్నారు. శనివారం పెద్దమందడి కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. నేటి సమాజంలో బాలికలపై జరుగుతున్న అన్యాయాలు, అసమానతలపై జాగ్రత్తగా ఉంటూ ఎవరైనా బాలకలతో అసభ్యంగా ప్రవర్తిస్తే చైల్డ్ లైన్ 1098కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమాజంలో అవగాహన కలిగి ఉండాలని, జీవితంలో లక్ష్యాలను చేరుకోవడానికి సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ లక్ష్మీదేవమ్మ, రూరల్ డెవలప్‌మెంట్ సభ్యురాలు లక్ష్మి, నాగలక్ష్మి, హరికృష్ణ తదితరులు ఉన్నారు.



విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న షీ టీం ఎస్ఐ ఇందిర

ఆరుద్ర పూజలు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటి లింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ఏకరుద్రాభిషేక పూజలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు శేఖరయ్య తెలిపారు. పరమశివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయంలో గల శివలింగానికి భక్తులు పాలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకొని ఆలయంలోని శివలింగానికి పాలాభిషేకం చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



బాధిత కుటుంబాలకు పరామర్శ

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 21వ వార్డుకు చెందిన ద్యారపోగు బాలరాజు శుక్రవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. అదేవిధంగా నాగమ్మతండాలోని కాలమ్మ, 9వ వార్డు బోనమ్మ తండాలో మాజీ సర్పంచ్ పుణ్యనాయక్ సతీమణి తాప్లినాయక్, ఇంద్రకాలనీకి చెందిన ద్యారపోగు మన్యం, జంగిడిపురంలో లక్ష్మీదేవమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. వారి మృతదేహాలకు చిన్నారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, చీర్ల జనార్దన్, పెద్దగూడెం ఎంపీటీసీ కురుమూర్తి, బాబా, డి.వెంకటేష్, బొంబాయి మన్నెంకొండ, జానకీరాములు, ఎల్లయ్య, రాములు, రాంరెడ్డి, దిలీప్, ఆసీఫ్ మియా, చీర్ల రాములు, భాస్కర్, అంజి నాగమ్మ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం..

ఖిల్లాఘనపురం: మండలంలోని సల్కెలాపురం మణెమ్మ ఇంటికి అల్లుడు నిప్పు పెట్టడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. దుస్తులు, వంట పాత్రలు, ధాన్యం గింజలు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఖిల్లాఘనపురం రింగుబాల్ టీం సభ్యులు కొంత డబ్బు పోగు చేసి బాధిత కుటుంబానికి బియ్యం, పప్పులు, వంట పాత్రలు, నగదు అందించారు.



బాలరాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న చిన్నారెడ్డి

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడలో శనివారం మంగలి కిష్టన్న అనారోగ్యంతో మరణించారు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న జూపల్లి అనుచరులు మృతుడి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు రూ.10వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు సర్పంచ్ చేతుల మీదుగా అందజేశారు.

విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలి



బలీదుపల్లిలో తారకయాదవ్‌ను సన్మానిస్తున్న శివసేనారెడ్డి

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బలీదుపల్లికి చెందిన తారక యాదవ్ ఇటీవల వెలువడిన ఎస్ఐ ఫలితాల్లో విజయం సాధించింది. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి శనివారం బలీదుపల్లికి చేరుకుని తారక యాదవ్, ఆమె తల్లిదండ్రులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. రానున్న రోజుల్లో మరెన్నో విజయాలు పొందాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసి గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్, యుగంధర్ రెడ్డి, శ్రీనివాసులు, జయకర్‌రెడ్డి, చిన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

గోపాల్‌పేట: మండలంలోని ఏదులకు చెందిన మహేశ్వరి ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో ఎస్ఐ ఉద్యోగం సాధించింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రెసిడెంట్ శివసేనారెడ్డి శనివారం ఏదులకు వెళ్లి మహేశ్వరిని అభినందించి సన్మానించారు.

అర్హులందరికీ 'గృహలక్ష్మి' అమలు చేయాలి

వీపనగండ్ల: దరఖాస్తు చేసుకున్న నిరుపేద కుటుంబాల వారందరికీ గృహలక్ష్మి పథకాన్ని వర్తింపచేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని వివిధ మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో 33,471 మంది గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకున్నారని, అందరికీ ఏక మొత్తంలో రూ.5 లక్షల ఆర్థికసాయం అందజేయాలని డిమాండ్ చేశారు. పలు గ్రామాల్లో కొంతమంది నిరుపేదలు కనీసం ఖాళీ స్థలం కూడా లేకుండా ఉన్నారని, వారందరినీ గుర్తించి స్థలాన్ని ఇప్పించి గృహలక్ష్మి పథకం ద్వారా ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.

ఉన్నత చదువు కోసం ఆర్థికసాయం

పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన తులసి అనే విద్యార్థినికి ఉన్నత చదువుల కోసం వనపరి నియోజక వర్గ నాయకుడు మేఘారెడ్డి రూ.15 వేలు ఆర్థికసాయం అందజేసినట్లు శనివారం కాంగ్రెస్ నాయకులు తెలిపారు. తులసి ఇంటర్‌లో 970 మార్కులు సాధించి హైదరాబాద్ కోటి ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ సీటు సాధించింది. అక్కడి వెళ్లి చదువుకోవడానికి స్తోమత లేక ఇబ్బందులు పడుతున్న క్రమంలో నాయకుల ద్వారా మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన విద్యార్థిని చదువుకోసం రూ. 15 వేలు పంపించారు. కార్యక్రమంలో రాజశేఖర్, అక్కి శ్రీనివాస్‌గౌడ్, అక్కి సుశీల, వెంకట్రాములు, సురేందర్‌గౌడ్, సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.



తులసికి ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ట్యూటర్లను నియమించాలి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ సంక్షేమ వసతి గృహాన్ని శనివారం కేవీపీఎస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి మురళి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో సంక్షేమ వసతి గృహం, గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వసతులు, ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు ట్యూటర్స్‌ను నియమించాలన్నారు. కార్యక్రమంలో నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

కొల్లాపూర్ కోటపై కాంగ్రెస్ జెండా ఎగరాలి



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నంబావి: వచ్చే ఎన్నికల్లో కొల్లాపూర్ కోటపై కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ఆ పార్టీ నాయకులు అన్నారు. చింతలపల్లి జగదీశ్వర్‌రావు ఆదేశాల మేరకు మండలంలోని కొల్లూరులో నాయకులు గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేపట్టే ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రైతు డిక్లరేషన్ కింద రూ.రెండు లక్షల రుణమాఫీ, ఆడబిడ్డలకు రూ.500 లకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షలు, భూమి లేని పేదలకు ఏటా రూ.12 వేల సాయం వంటి పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో కాజద్ యాదవ్, నరేందర్‌గౌడ్, కాంతారెడ్డి, రాంసింగ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులపై చిత్తశుద్ధి లేదు



పెబ్బేరు రూరల్: నిరుద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బహుజన సమాజ్ పార్టీ నాయకులు దుయ్యబట్టారు. శనివారం పట్టణ కేంద్రంలో సుభాష్ చౌరస్తాలో ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపట్టామన్నారు. కార్యక్రమంలో రాముడు, గణపురం కృష్ణయ్య, రాంబాబు, రామచంద్ర, సుజాత, అశోక్, మనోహర్, అంజనేయులు, సాయికుమార్, శివ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పెబ్బేరు రూరల్: హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపట్టిన పాత పింఛన్ పునరుద్ధరణ సభకు శనివారం మండలంలోని ఉపాధ్యాయులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దయానంద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యోగుల పాలిట శాపమైన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నస్వామి, రవికుమార్, చిన్నరాములు, రాజు, శివశంకర్, చంద్రశేఖర్‌రెడ్డి, షణ్ముఖశ్రీను, మల్లికార్జునరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, వెంకటేష్, లక్ష్మయ్య, కృష్ణయ్యగౌడ్, దుర్గప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌కు వెళ్తున్న ఉపాధ్యాయులు

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న బీఎస్పీ నాయకులు

చిన్నంబావి: బహుజన రాజ్యాధికార సంకల్ప సభ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా కోడేరు మండల కేంద్రంలో ఈ నెల 18న నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని బీఎస్పీ అధ్యక్షుడు బొల్లి కురుమయ్య అన్నారు. ఈ మేరకు శనివారం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ అధ్యక్షుడు మునిస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో పటేళ్లు, దొరలు, సామంత రాజులను గడగడలాడించి గోల్కొండ కోటను హస్తగతం చేసుకుని బహుజన రాజ్యాన్ని స్థాపించిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు బీఎస్పీ ఆధ్వర్యంలో కోడేరు మండల కేంద్రంలో ఈ నెల 18న సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమేష్, సుధాకర్, బాలు, విధాత, గోవిందు నాగరాజు, సాయికుమార్, పవన్, శ్రీనివాసులు, స్వాములు, కృష్ణయ్య, భాను, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పోరాటల చరిత్ర ఏఐఎస్‌ఎఫ్‌దే..

పెబ్బేరు రూరల్: నాడు స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏఐఎస్‌ఎఫ్, నేడు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నడుం బిగిందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనిగె నరేష్, డివిజన్ కార్యదర్శి వంశీ అన్నారు. శనివారం వనపర్తి పట్టణ సీపీఐ కార్యాలయం వద్ద ఏఐఎస్‌ఎఫ్ పతాకాన్ని ఎగరవేసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో నాయకులు భానుసాగర్, ప్రసాద్, భానుప్రకాష్, వెంకటేష్, హేమచందర్, విశాల్ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

